క్లుప్తంగా

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి


మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు: ఆరు నుంచి 14 ఏళ్ల లోపు విద్యార్థులు తప్పనిసరిగా చదువుకోవాలని ఎంఈవో–2 డీవీడీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ పాఠశాల పరిధిలోను నేనూ బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. బడి ఈడు వయస్సు గల వారు చదువుకోకుండా ఉండకూడదన్నారు. గ్రామాల్లో, శివారు గ్రామాల్లోను ఇందుకు సంబంధించి ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీవో పట్నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి కిట్ల పంపిణీ


కిట్లను సరఫరా చేస్తున్న ఎంఈవోలు పడాల్‌దాస్, ఉషారాణి

దేవరాపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను అందజేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు–1, 2 బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు కిట్లను ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రెండు రోజుల్లో వీటిని పంపిణీ చేస్తామన్నారు. ఈ కిట్లలలో యూనిఫాం, బ్యాగ్, షూ, బెల్టు, టై, నోట్ బుక్స్ తదితర సామగ్రి ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటరమణ, తదితర ఎం.శ్రీను, సిహెచ్.రమేష్ తదితర ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

133 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంతో గ్రామాల్లో ప్రజల చెంతకే మెరుగైన వైద్యం అందనున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. శనివారం దాలివలసలో వైద్య శిబిరం నిర్వహించారు. 133 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలతోపాటు ఆరోగ్య తనిఖీలు చేశారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా వారానికి ఒక రోజు తప్పనిసరిగా తొలగించుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎస్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోలుగుంట పీఏసీఎస్‌లో ఆడిట్


రికార్డులు తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

రోలుగుంట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో శనివారం వార్షిక ఆడిట్ జరిగింది. ఇక్కడ సభ్యులకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో పలు రకాల (లాంగ్‌టర్మ్, వ్యవసాయ, గోల్డ్) రుణాలను సీఈవో మడ్డు మహేష్, సిబ్బందితో కలసి సభ్యులకు మంజూరు చేశారు. ఈ రుణాలు సక్రమమేనా, సభ్యుల తీసుకున్న రుణాలు, జమలకు సంబంధించిన రికార్డులను యలమంచిలి జిల్లా కేంద్ర సహకార ఉప కార్యాలయం అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ డి.శ్రీనివాస్ ఆడిట్ చేశారు. రుణాల మంజూరు, జమలకు సంబంధించి అవసరమైన రసీదులను రికార్డులతో సరిపోల్చారు.

పాము కలకలం

తుమ్మపాల: జిల్లా (ఎన్టీఆర్) ఆస్పత్రిలో శనివారం పాము కలకలం సృష్టించింది. ఆస్పత్రి పరిసరాల్లో డ్రైనేజీ కాలువ నుంచి చిన్నపాటి పాము ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. అక్కడ ప్రజలు కేకలు చేయడంతో ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తమై చంపేశారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- విరిగిన కరెంట్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం


గొలుగొండ: ఏఎల్‌పురంలో కురుస్తున్న భారీ వర్షం


నర్సీపట్నం : సీబీఎం కాంపౌండ్ సమీపంలో విద్యుత్ లైన్లపై విరిగిపడిన చెట్టు

నర్సీపట్నం: ఈదురు గాలులతో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి మేఘావృతమైంది. ఈదురు గాలులతో చిరుజల్లులతో వర్షం ప్రారంభమైంది. సుమారు గంట పాటు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పట్టణంలో మెయిన్ డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పట్టణంలో సీబీఎం కాపౌండ్ చర్చి వద్ద చెట్టు విరిగి విద్యుత్ లైన్లపై పడింది. ఏరియా ఆస్పత్రి సమీపంలో పార్కు వద్ద రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పట్టణంలో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయాయి.

దేవరాపల్లి: ఈదురు గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం శనివారం సాయంత్రం దేవరాపల్లిలో కురిసింది. రోడ్లపైన, పొలాల్లో ఎక్కడికక్కడ వర్షం నీరు నిలిచిపోయింది. ఈ వర్షం ఖరీఫ్ సాగు పనులకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలుల ధాటికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

ఏఎల్‌పురంలో..

గొలుగొండ: మండలంలో ఏఎల్‌పురం, కొంకసింగి, నాగాపురం, కృష్ణదేవిపేట తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట పాటు కుండపోతగా వర్షం కురవడంతో ఈ ప్రాంతమంతా పూర్తిగా చల్లబడింది. మెరక ప్రాంతాల్లో చెరకు, సరుగుడుతోపాటు ఇతర పంటలకు మేలు కలుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గాలులుతో కూడిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గొలుగొండ, చిన్నయ్యపాలెం, కొత్తమల్లంపేట, అమ్మపేట, జోగుంపేట ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

కె.కోటపాడు: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇటీవల వేసవి ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడ్డ ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఖరీఫ్‌లో వ్యవసాయ పనులను నిర్వహించుకునేందుకు కూరగాయల సాగుకు వర్షం మేలు చేయనున్నట్లు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కె.కోటపాడు: చౌడువాడలో కురుస్తున్న వర్షం

చల్లబడ్డ వాతావరణం

మాడుగుల రూరల్: ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం శనివారం సాయంత్రం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం నుంచి వర్షం పడింది. వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులు వల్ల పలు చోట్ల వృక్షాలు నేలమట్టం అయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కురిసిన వర్షంతో ఖరీఫ్ పనులకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.


దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం


మాడుగుల రూరల్: కె.జె.పురంలో కురుస్తున్న వర్షం


నర్సీపట్నం : పార్కు వద్ద విరిగిన విద్యుత్ స్తంభం

సబ్సిడీ విత్తనాల విక్రయం ప్రారంభం


రేవళ్లులో విత్తనాల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం రూరల్/రోలుగుంట: చోడవరం పట్టణ శివారు రేవళ్ల గ్రామంతోపాటు రోలుగుంట పీఏసీఎస్‌లో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు శనివారం సబ్సిడీపై విత్తనాల విక్రయాన్ని ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన ఖరీఫ్ విత్తనాలను అందించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా తన అధికారిక కార్యక్రమాన్ని రేవళ్ల నుంచే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. రైతులకు కావాల్సిన వరి విత్తనాలను సకాలంలో అందించి సాగుపరంగా అవసరమైన సూచనలివ్వాలన్నారు. వ్యవసాయ శాఖ, ఆర్బీకే అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు వి.రవీంద్రనాథ్, ఏవో ఇ.పావని, వ్యవసాయ విస్తరణాధికారి కిరణ్, చోడవరం సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మత్సరాజు, మాజీ ఎంపీపీ గూనూరు వెంకట సత్యనారాయణ(పెదబాబు) విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, గంగాధర్, సర్పంచ్ పంచాడ చంద్ర, రోలుగుంట మండలాధ్యక్షుడు గుములూరి చంద్రమౌళి, కొండలెం ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, బోళెం రమేష్‌దొర, సుంకర కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన

కొరువాడ హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో పట్నాయక్, ఎంఈవో సత్యనారాయణ.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో పట్నాయక్, ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందుతున్నాయని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. కొరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఎంఈవో సత్యనారాయణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా కిట్లు వెంటనే అందజేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. వారి తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఎంఈవో తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రోజూ మెనూ ప్రకారం ఉండేలా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయ సిబ్బంది పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.కమలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో చిన్నారుల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపు


ఎ.కోడూరులో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేయడం వల్ల వారిలో వ్యాధులను ఎదుర్కొగలగే శక్తి సమకూరుతుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. శనివారం ఎ.కోడూరు, వారాడ గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎ.కోడూరులో 19 మంది, వారాడలో 13 మంది చిన్నారులకు టీకాలు వేశారు. రెండు గ్రామాల్లో 12 మంది గర్భిణులకు ధనుర్వాతం సోకకుండా టీకాలు వేశారు. ఏఎన్ఎం సంతోషికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో మంచి దిగుబడులు సాధించాలి


బోయిలకింతాడ ఆర్బీకేలో రైతులకు వరి విత్తనాలను అందజేస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు

దేవరాపల్లి: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఖరీఫ్ వరి విత్తనాలతో రైతులు నాట్లు వేసి మంచి దిగుబడులు సాధించాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు అన్నారు. బోయిలకింతాడ రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసిన ఖరీఫ్ వరి విత్తనాలను శనివారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. స్వర్ణ, ఆర్జీఎల్, సాంబమసూరి తదితర రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖరీఫ్ వరి సాగు చేసే ప్రతీ రైతుకు విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయ సిబ్బందికి సూచించారు. చక్కెర కర్మాగారం చెరకు అభివృద్ధి మండలి సంస్థ డైరెక్టర్ అన్నం రాము, దేవరాపల్లి మండలి వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ అన్నం రాము నాయుడు, స్థానిక పాల సంఘం అధ్యక్షుడు అన్నం సాంబమూర్తి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ కొప్పాక వెంకటరావు, స్థానిక ఆర్బీకే ఇన్‌చార్జి ఎస్. యశోద పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయం

అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షుడు రవిచంద్రన్


గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షుడు రవిచంద్రన్, తదితరులు

దేవరాపల్లి: పెదనందిపల్లి వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయమని అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షుడు కె.రవిచంద్రన్ కొనియాడారు. జమ్మాదేవిపేట జంక్షన్ సమీపంలో నూతనంగా నిర్మించిన వాసవీ మాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అంతకు ముందు వాసవీమాతను దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా వాసవి క్లబ్ సేవల విస్తరించామని, మానవ సేవే–మాధవ సేవ నినాదానికి సార్థకత చేకూర్చేలా ప్రతీ సభ్యుడు సేవా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ వై. నర్సింగరావు, జోన్ చైర్మన్ పి. రామకృష్ణ, వాసవి క్లబ్, వనితా క్లబ్ సభ్యులు నాగఅప్పారావు, శ్రీనివాసరావు, రాజు, రోహిణి, లావణ్య, సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలుర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

మాడుగుల రూరల్: మండలంలో నర్సయ్యపేట(దిబ్బారు) గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బావరాజు అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ఐదో తరగతి వరకు 20 సీట్లు చొప్పున, ఆరో తరగతిలో 40, ఏడో తరగతిలో 23, ఎనిమిదో తరగతిలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ విద్యార్థులకు 10 శాతం రిజర్వేషన్ ప్రకారం వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8688525042 సంప్రదించాలన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

నర్సీపట్నం: ఈ నెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పోలీసు అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టులో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి అవకాశమన్నారు. ఈ విషయం కక్షదారుల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఘనంగా రాధాకృష్ణుల తీర్థం


కె.జె.పురంలో రాధాకృష్ణులను దర్శించుకుంటున్న భక్తులు


ఆలయం వద్ద మహిళల కోలాటం

మాడుగుల రూరల్: కె.జె.పురం –దబ్బకుంటు రహదారిలో రాపేట వారి కళ్లాల వద్ద రాధాకృష్ణుల తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు ఎం. కోటపాడు, వల్లాపురం, వంటర్లపాలెం, ఘాట్‌రోడ్డు, తదితర చోట్ల నుంచి వచ్చిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మహిళల కోలాటం ఆకట్టుకుంది. సాయంత్రం వర్షం కురవడం వల్ల ఎడ్ల పరుగు పోటీలు రద్దు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వరి విత్తన విక్రయాలకు రసీదు తప్పనిసరి


దేవరాపల్లి హేమ రైతు డిపోలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: లైసెన్స్ దుకాణాల్లో విక్రయించే వరి విత్తనాలకు రసీదు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ ఆదేశించారు. ఈ మేరకు దేవరాపల్లిలో లైసెన్స్ విత్తనాల దుకాణాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తన బస్తాలతో పాటు రికార్డులను పరిశీలించారు. దుకాణాల వద్ద రైతులకు తెలిసేలా విత్తనాల ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లైసెన్స్ దుకాణదారుల వద్ద సోనామసూరి, సాంబమసూరి, స్వర్ణ, శ్రీకాకుళం సన్నాలు, అమర, పుష్యమి తదితర రకాల 50 టన్నుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా వరి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, నాణ్యత లోపించినా తమకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు


ఉత్సవాలకు సిద్ధం చేసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయక కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి 14వ వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్వామివారి కల్యాణోత్సవాల అంకురార్పణ, విశ్వక్సేన పూజ, పుట్ట మట్టి తెచ్చుట, నవకలశస్నపనం, పుణ్యాహవచనం, రక్షా బంధనం, వాస్తు మండపం పూజలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం ఎదురు సన్నాహం, అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త, కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, సభ్యులు శనివారం పేర్కొన్నారు. ఉత్సవాలు సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అదే రోజు ఆలయం వద్ద అన్నసమారాధన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 19వ తేదీ సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవం, 22న నాగవల్లి సంబరాలు, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు పుష్పాంజలి సేవ, ఊంజల్‌సేవ, అనంతరం దర్పదర్శనంతో ఉత్సవాలు ముగిస్తాయని వారు తెలిపారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించండి


సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఎన్నికల ప్రక్రియ ముగిసిందని గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన శనివారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని, ఇక మీదట మనమంతా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించుట, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా వర్షాలను దృష్టిలో ఉంచుకుని వీధులను డ్రైనేజీలను శుభ్రంగా ఉండేలా చేయాలన్నారు. అంటువ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. తాగునీటి పథకాలను క్లోరినేషన్ విధిగా చేయాలన్నారు. వీధి లైట్లు నిర్వహణ, ఇంటి పన్నులు వసూలు తదితర అంశాలపై కార్యదర్శులు బాధ్యతగా ఉండాలన్నారు. మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వి.ఎస్. మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.